18102023-DIS-08_Layout 1 10/18/2023 3:05 AM Page 1



## నమస్తే తెలంగాణ

# మళ్లా ఓటుకు నోటు

**అవినీతి** కాంగ్రెస్ పుట్టల్లోంచి కట్టలు కట్టలు పాముల్లా బయటికి వస్తున్నాయి. ఓటును కాటేసేందుకు నోటు మరోసారి బుసలు కొడుతున్నది. కాంగ్రెస్ మార్క్ ఎన్నికల కుతంత్రం, పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు రూపంలో బట్టబయలవుతున్నది. ఈ నోట్ల బారు కర్ణాటక నుంచి వస్తుండటం ఆలోచించాల్సిన విషయం. నిన్నగాక మొన్న అక్కడి ప్రజలు, 'అతని కంటే ఇతడు ఘనుడు' అన్నట్టుగా బీజేపీని సాగనంపి కాంగ్రెస్‌ను నెత్తికెత్తుకున్నారు. బీజేపీ మత విద్వేష విధానాలు, అలవిమాలిన అవినీతి అందుకు కారణం. పాపం... వేరే ప్రత్యామ్నాయం లేక వారు 'హస్తగతమై'పోయారు. వచ్చి 4 నెలలు కాకముందే ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి గంగలో కలిపిన కర్ణాటక కాంగ్రెస్ నేతలు, అవినీతిలో ఇక ఇప్పుడు బీజేపీ కన్నా ఒక ఆకు ఎక్కువే చదివారు. కమలం పార్టీ కమిషన్ 40 శాతమైతే కాంగ్రెస్ ఫిఫ్టీ పర్సెంట్ అంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తలు కర్ణాటక వారేనంటున్నారు. అందుకే డబ్బులూ అక్కడినుంచి వస్తున్నట్టు భావించాలేమో! కర్ణాటక మాడల్ ఇక్కడా కాపీ చేస్తామని దింపుడుకల్లం ఆశలు పెట్టుకున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకుల దగ్గర కాపర్స్ తప్ప కరెన్సీ లేనట్టుంది. అందుకే కరెన్సీ కూడా అక్కడినుంచే తెచ్చుకుంటున్నట్టు కనిపిస్తున్నది. బెంగళూరులో గత మూడురోజులుగా ఐటీ దాడుల్లో 90 కోట్ల రూపాయలు దొరకడం, పట్టుబడ్డ వారంతా కాంగ్రెస్ నేతలే కావడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది.

మోసపోతే గోస పడుతమని కర్ణాటక ప్రజల అవస్థల సాక్షిగా తెలంగాణ ఓటరుకు అర్థమైపోతున్నది. అక్కడ ఐదు హామీలు అమలుచేయలేక చతికిలపడ్డవారు ఇక్కడ ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని ఎగురుతున్నారు. స్కాంగ్రెస్ మార్కు అవినీతిలో మునిగితేలుతున్నారు. కేంద్రం పైసా ఇవ్వకపోయినా భారీ ఖర్చుతో, పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టుకున్నా అవినీతి కంపు మనకు చుట్టుకోలేదు. ఇగురంతో సాగించిన పాలనపై విపక్షాలు పబ్బం గడుపుకొనేందుకు చేసే గబ్బు ఆరోపణల మాటేముంది? వాటికి సాక్ష్యాలు, రుజువులు అడగొద్దు. అలాంటి ఊకదంపుడు తప్ప ఏ కాంట్రాక్టర్ అయినా నన్ను ఫలానా వారు కమిషన్ అడిగారని ఆరోపించిన ఉదంతం తెలంగాణలో ఒక్కటైనా ఉందా!

ఎన్నికల హామీలను గ్యారంటీలంటూ నమ్మబలికేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ ఒక్క చాన్స్ అంటూ ఓటరు వెంట పడుతున్నది. కర్ణాటక మాడల్‌ను దేశమంతా నింపేయాలని ఆరాటపడుతున్నది. అమలు చేయలేని హామీలను నమ్మి తెలంగాణ 'చే'జిక్కితే అంతే సంగతులు. తెలంగాణ ఓటరును తేరగా కొనేసే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఆడలేక మద్దెల ఓడన్నట్టు గెలవలేక నోట్లు బయటికి తీస్తున్నవారికి పొరపాటున అధికారమిస్తే ఏం చేస్తరో తెలియనంత అమాయకులు ఇక్కడ ఎవరూ లేరు. అయినా అజాగ్రత్త పనికి రాదు. ఆదమరిస్తే అంతే సంగతులని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు హెచ్చరించారో వారికి తెలుసు. కాసులు విసిరి ఓటు లాగేసుకోవాలని చూసేవారికి సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెడతారు. కాంగ్రెస్ చెప్తున్న కర్ణాటక మాడల్ అంటే గెలుపు కాదు. తెలంగాణ సంపదను దోచుకునే అవినీతి!

# కాంగ్రెస్ ఇచ్చి గుంజుకున్నది!



డాక్టర్ ఎంఏ శ్రీనివాసన్

తెలంగాణ మేమే ఇచ్చామనే కాంగ్రెస్ నాయకులకు ఒకే ప్రశ్న! ఉద్యమాలు రాజుకున్నపుడు తప్ప లేనపుడు ఎన్నడైనా తెలంగాణ మాట ఎత్తారా? మీ రాజకీయ అవసరానికి తప్ప చిత్తశుద్ధితో కొట్లాడారా? ఉప ఎన్నికల్లో తుక్కుతుక్కుగా ఓడగొట్టి.. పీకల మీద కత్తి పెడితే తప్ప తెలంగాణ ఇచ్చారా? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకే జవాబు. లేదు! ఒక్కనాడు బరిగీసి కొట్లాడని నాయకులు ఇప్పుడు మేమే తెచ్చామంటూ సొల్లు కబుర్లు చెప్తున్నారు. కేసీఆర్ నేతృత్వంలో సమాజం ఏకతాటి మీద నిలబడి కొట్లాడకుంటే.. ఈ భ్రష్ట కాంగ్రెస్ ఇంకో వందేండ్లకూ రాష్ట్రాన్ని ఇచ్చేదే కాదు. అదే సమయంలో ఉద్యమం రాజుకున్నపుడల్లా వాడుకొని ఎన్నికలు కాగానే వదిలేసేది. గత చరిత్ర అంతా ఇంతే!


ఎవరైనా నా బర్త్‌డే సందర్భంగా గిఫ్ట్ ఇస్తున్నానని చెప్పి వెంటనే దాన్ని వాపస్ తీసుకుంటే ఆ మోసాన్ని ఏమంటారు? దాన్ని డిసెంబర్ 9 మోసం అంటారు. నిజానికి తెలంగాణ సమాజానికి డిసెంబర్ 9 ప్రకటన సోనియా గాంధీ తన బర్త్‌డే నాడు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గిఫ్ట్ కంటే శాపంలా మారింది. ఆరు దశాబ్దాల కల సాకారం అవబోతుందన్న సంతోషంలో ఉన్న ప్రజలతో ఒక వికృత పరిహాసం ఆడింది కాంగ్రెస్ పార్టీ. దశాబ్దాల ప్రజాస్వామిక ఆకాంక్ష, సీమాంధ్ర నాయకుల మూకుమ్మడి రాజీనామాలు తమకు ఈక కంటే తేలిక అని తేల్చి చెప్పి తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను మళ్లీ మొదటికి తెచ్చింది.

### ఎన్నికల చుట్టూనే కాంగ్రెస్ కసరత్తులు!

2009, డిసెంబర్ 9న గెలుచుకున్న తెలంగాణను డిసెంబర్ 23న పోగొట్టుకున్న ఫీలింగ్ అప్పటి తెలంగాణ సమాజంలో యాక్టివ్‌గా ఉన్న అందరికీ ఇప్పటికీ కళ్లెదుట ఉన్నట్టే ఉన్నది. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో డిసెంబర్ 9 ప్రకటన చేస్తున్నానన్న కేంద్ర హోంమంత్రి చిదంబరమే డిసెంబర్ 23న మారిన పరిస్థితుల దృష్ట్యా సంప్రదింపులు అంటూ మళ్లీ ఒకసారి తెలంగాణను అటకెక్కించారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే అప్పటికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చి ఏడు నెలలైంది. ఎన్నికలకు ఇంకో నాలుగేండ్ల టైం ఉన్నది. అదీ కాంగ్రెస్ ధీమా. తెలంగాణ అంశం ఎన్నికల్లో రాజుకుంటుంది, ఓట్లకు కీలకమవుతుంది కాబట్టి మ్యానిఫెస్టోలో పెడతారు. కానీ, ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు వినిపించిన అభిప్రాయాలను మాత్రం వారి రాజకీయ ప్రయోజనాల అధీనంలోనే ఉంచింది కాంగ్రెస్.

### అంతా ఆంధ్రాధీనం..

ఇక్కడ మనం చర్చించుకోవాల్సిన అంశం ఇంకోటి ఉన్నది. కాంగ్రెస్‌లో తెలంగాణ నాయకత్వం ఉన్నది పేరుకే. వీళ్ల మాటకు పార్టీలో పూచిక పుల్ల విలువ కూడా ఉండదు. మలిదశ ఉద్యమ సందర్భంలో, కాంగ్రెస్‌లో కూడా కొందరు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు వారి వారి పరిమితుల్లో సోనియా దగ్గర చేసిన లాబీయింగ్ కొన్నిసార్లు ఫలించినా, ఎక్కువసార్లు ఆంధ్రా లాబీయింగ్‌దే పైచేయి అయ్యింది. ఏదేమైనా ఇప్పుడు చేస్తున్న చర్చ తెలంగాణకు కాంగ్రెస్ ఏం చేసిందనే. అంటే కాంగ్రెస్ ఒక పార్టీగా తీసుకున్న నిర్ణయాలు ఎలా ఉన్నాయనే కానీ, కొందరు వ్యక్తుల సహాయాన్ని, తపనను బేరీజు వేయడం కాదు. కొన్ని సందర్భాల్లో తెలంగాణ కాంగ్రెస్ సభ్యులు మూకుమ్మడిగా ఉత్తరం రాసినా అది సీరియస్‌గా ముందుకుపోలేదు, కమిటీల సాలెగూటిలో చిక్కుకొని కొట్టుకుంటూ ఉండిపోయింది. 2001లో 41 మంది కాంగ్రెస్ శాసనసభ్యులు సోనియాగాంధీకి తెలంగాణ ఇవ్వాలని కోరుతూ ఉత్తరం రాస్తే అది చిన్న రాష్ట్రాల గురించి చర్చించడం కోసం ఏర్పాటైన కమిటీ పేరిట అటకెక్కింది. ఆంధ్రాతో తెలంగాణను కలిపేసిన మొదటి కమిటీలో ఉన్న దిగ్గజాలు నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, ఢేబర్, కే ఎన్ కట్జూల నిర్ణయంతో తెలంగాణ భవిష్యత్తు సీల్ చేసిన కాంగ్రెస్, చివరి దశలో కూడా ప్రణబ్ ముఖర్జీ కమిటీ లాంటి కమిటీలే వేసింది ఆరు దశాబ్దాల పరాధీనతకు కారణం కాదా? కాంగ్రెస్ పార్టీ జవాబు చెప్పాల్సి ఉంటుంది.




### స్తబ్ధుగా ఉంటే గుర్తుకే రాదు!

ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మాత్రమే కాంగ్రెస్‌ను ప్రతీసారి మెడలు వంచిందే తప్ప, ఉద్యమం స్తబ్ధుగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఒక్కసారి కూడా తెలంగాణను, అప్పుడప్పుడు తెలంగాణకు అన్యాయం జరిగిందనే విషయం ఎత్తిన తెలంగాణ శాసనసభ్యుల ఫోరమ్, తెలంగాణ కాంగ్రెస్ ఫోరమ్ వంటి వేదికలు చేసిన ప్రయత్నాల్ని కూడా పెద్దగా పట్టించుకోలేదు. అందుకే రెండవ ఎస్సార్సీ ఏర్పాటు చేయడం తమ పార్టీ అంగీకరించదని మాజీ హోం మంత్రి అద్వానీ చెప్పగానే, ఊరుకున్నారు తప్ప ఒక అడుగు కూడా ముందుకు వేయలేదు. అందుకే టీఆర్ఎస్ ఏర్పాటైనప్పటి నుంచి కాంగ్రెస్‌కు తెలంగాణ అంశాన్ని యాక్టివ్‌గా పట్టించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### పద్నాలుగేండ్ల చోద్యం..

తెలంగాణ గురించిన చర్చ 2001లో మొదలైనప్పటి నుంచి సోనియాగాంధీకి ఈ విషయం తెలుసు. 2004 ఎన్నికల్లో తెలంగాణ పట్ల సానుకూల వైఖరే చంద్రబాబును ఓడించి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడానికి కారణమైంది. కామన్ మినిమం ప్రోగ్రాం, రాష్ట్రపతి ప్రసంగం వంటి చర్యల పర్యవసానం ఏమిటి? మళ్లీ 2009లో ప్రజా ఉద్యమం, కేసీఆర్ నిరాహార దీక్షలు మాత్రమే సోనియా ముందుకు తెలంగాణను తెచ్చాయి. మరి 2001 నుంచి 2009 వరకు తొమ్మిదేండ్లు, 2009 నుంచి 2014, అంటే మొత్తం 14 ఏండ్లు సోనియా చోద్యం చూసిందే తప్ప, తెలంగాణను సాకారం చేయలేదు. 1969 ఉద్యమంలో ఇందిరాగాంధీ మొండి వైఖరి నాలుగేండ్లు కొనసాగితే సోనియా ముందు తెలంగాణ వ్యవహారం 14 ఏండ్లు నానింది. అందుకే 2009 డిసెంబర్ 9 నాడు ఇచ్చింది బర్త్ డే గిఫ్ట్ అన్నప్పుడు ఒక మోసపూరిత మాటలాగ తోస్తుంది. కాంగ్రెస్ వాళ్లయితే ఇచ్చింది సోనియానే కదా ఆమె తలుచుకోకుంటే తెలంగాణ సాకారం అయ్యేదా? అంటే ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసినట్టు అనిపిస్తుంది.

### తప్పక ఇచ్చిందే తప్ప.. ప్రేమతో కాదు

తెలంగాణ ప్రజల నిరంతర పోరాటం, కొన్నిసార్లు ఉవ్వెత్తున కొన్నిసార్లు స్తబ్ధుగా కొనసాగి సోనియా నేతృత్వంలోని కాంగ్రెస్ ముందు తెలంగాణకు ఎస్ చెప్పాల్సిన పరిస్థితిని కల్పించింది తప్ప ప్రజల ఆకాంక్షలపై గౌరవం ఉండి కాదు. ఇదే మాట, 'ఒక ఓటు, రెండు రాష్ట్రాలు' అన్న నినాదం ఇచ్చిన బీజేపీ, 'రెండు కండ్ల సిద్ధాంతపు' తెలుగుదేశం అందరికీ వర్తిస్తుంది. ఈ పార్టీలకు నిజంగానే గౌరవం ఉండి ఉంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఎప్పుడో సాకారమయ్యేది.

### ఆ బలి దానాలకు కారణమెవరు?

మలిదశ ఉద్యమంలో ఆత్మహత్యలు ఒక విషాదకర సన్నివేశంగా మారడానికి ఇంతకాలం తాత్సారం చేసిన కాంగ్రెస్ జవాబుదారీనా? కాదా? చెప్పాలి. ఎందుకంటే ప్రజలను ఉగ్రూతలూగించి ఉద్యమించడానికి ఆక్సిజన్‌గా ఉన్న ఆశావహ పరిస్థితులు తగ్గినప్పుడల్లా, తెలంగాణ వస్తుందో రాదో అనే నిరాశ సమాజాన్నే డిప్రెస్ చేసింది, కుంగదీసింది. దాని ఫలితమే ఆత్మహత్యలు. మేము ఇస్తేనే తెలంగాణ వచ్చిందని చెప్పే కాంగ్రెస్ సుమారు 1500 బలిదానాల బాధ్యతను ఎవరి ఖాతాలో వేయాలో చెప్పాలి.

### చివరిరోజుల్లో కూడా అదే తంతు

శ్రీకృష్ణ కమిటీ ఇంకో కాలయాపన తంత్రం. అదిచ్చిన రిపోర్టు కూడా తెలంగాణ వ్యతిరేకుల ఇన్‌ఫ్లుయెన్స్‌లో రాసినట్టుంది తప్ప నిజాయితీతో కూడింది కాదు. ఈ కమిటీ నిజానికి కాంగ్రెస్‌కు తెలంగాణ సమస్యను కొంతకాలం పోస్టుపోన్ చేయడానికే ఉపయోగపడింది. శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులో తెలంగాణకు అనుకూలంగా లేకపోవడమే కాదు, ఒక అడుగు ముందుకుపోయి ఉద్యమాన్ని అణచివేసే పద్ధతులను సూచించింది.

### గోచీలు గల్లంతవుతాయనే...!

చివరగా 2013 జూలైలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడానికి కాంగ్రెస్ నుంచి రాజీనామా పరంపరలే కారణం. కే కేశవరావు, మంద జగన్నాథం వంటి వాళ్లు కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం కాంగ్రెస్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఆలస్యం చేస్తే గోచీ గుడ్డ కూడా మిగిలేలా లేదని తేటతెల్లం కావడం వల్లనే జ్ఞానప్రాప్తి కలిగి తెలంగాణ నిర్ణయానికి తలొగ్గింది. తెలంగాణ బిల్లును చర్చించడానికి రాష్ట్రపతి పంపినప్పుడు తెలంగాణపై చర్చను కంట్రోల్ చేయడానికి శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును తప్పించి ఆంధ్రకు చెందిన మంత్రి సాకే శైలజానాథ్‌కు ఆ శాఖను ఇచ్చినా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిని నిలదీసిన తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు ఒక్కడూ లేడు. శ్రీధర్‌బాబు సమైక్యాంధ్రను సమర్థిస్తూ, కిరణ్‌కుమార్‌రెడ్డికి మంచి అనుయాయిగా ఉన్నా కాంగ్రెస్ ఇచ్చిన కరెక్ట్ బహుమతి ఇది.

### ఎన్నికల భయం వెంటాడి..

2014 ఎన్నికలు రాబోతున్న తరుణంలో 2009 నుంచి ఎదిరించి నిలిచిన తెలంగాణ ముందు తలొగ్గి తప్పనిసరి పరిస్థితిలో 2013 నుంచి ప్రక్రియ మొదలైంది తప్ప ప్రజాస్వామిక ఆకాంక్షలను గుర్తించి, గౌరవించి ఇచ్చిన ప్రత్యేక తెలంగాణ కాదు. అందుకే తెలంగాణ ఏర్పాటు కాంగ్రెస్ అనుకుంది కాబట్టి అయిందని కాంగ్రెస్, మేము సమర్థించినందుకు వచ్చిందని బీజేపీ గొప్పలు చెప్పుకున్నా చరిత్ర వారి పక్షాన నిలవదు. అన్నింటినీ మించి సోనియానే తెలంగాణ ఇచ్చిందని చెప్పుకొని ఓట్లు అడుక్కునే ముందు, తెలంగాణ ఏర్పాటుకు ఇన్నేండ్లు ఎందుకు పట్టిందో జవాబు చెప్పాలి. తెలంగాణ ఒకరి దయాదాక్షిణ్యాల వల్ల రాలేదు. తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటాలు, ప్రత్యేక తెలంగాణ కోసమే పుట్టిన టీఆర్ఎస్ వంటి రాజకీయపార్టీలు, విశాల ప్రజారాశులకు ప్రతినిధులైన సంస్థల నిరంతర పోరాటమే తెలంగాణను తెచ్చింది. ఇదే చరిత్ర చెప్పే సత్యం.

# 'జన మ్యానిఫెస్టో' జిందాబాద్

దురాశాపరుల సుదీర్ఘ కాలపు ముట్టడికి విలవిలలాడిన తెలంగాణ, గడిచిన పదేండ్లలో గడియారం ముల్లులా అభివృద్ధి చుట్టూ తిరిగింది. పడిపోతే చూడాలని, మేము ముందే చెప్పామని వాగాలని ఎదురుచూసిన కబోదులందరి దిమ్మతిరిగే ప్రగతి రాష్ట్రం అనుభవంలోకి వచ్చింది. కవలలైన శాంతి, సుస్థిరాభివృద్ధిలను కడుపులో పెట్టుకొని, వొరగకుండా నిటారుగా నడుస్తూ వచ్చింది తెలంగాణ. అందుకే నిష్ఠూరమాడిన ఇరుగు పొరుగు కూడా, మాకూ కేసీఆర్ లాంటి నాయకుడుంటే బాగుండేదనుకుంటున్నారు. ఎన్నికలు, గెలుపోటములను దాటి ప్రజల బతుకులే కొలమానంగా ప్రణాళికలు రూపొందించుకునే నాయకత్వం ఏడున్నర దశాబ్దాల భారతదేశ రాజకీయవ్యవస్థలో అరుదుగా మారిపోయింది.



డాక్టర్ ఆంజనేయ గౌడ్
98853 52242



దేశ రాజకీయాల్లో నెహ్రూ లాంటివారు తొలినాళ్లలో అన్ని రంగాలను సవ్యమార్గంలో నడిపించేందుకు కొంత దృష్టిసారించినా, తర్వాతి నాయకత్వం తత్తరపాటుకు లోనై, తలో వైపు జాతి దిశను లాగి తికమకలలోకి నెట్టినవారే. కానీ, కేసీఆర్ మాత్రం తెలంగాణ వర్తమాన సమస్యలు, భవిష్యత్తు సవాళ్లను కూడా స్వీకరించి, పరిష్కారం అందించారు. అందువల్లనే తలసరి ఆదాయంలో ఏ రాష్ట్రం కూడా తమ దరిదాపులకు వచ్చే పరిస్థితి లేని ఉన్నత స్థాయికి తెలంగాణ ప్రజలు చేరుకున్నారు. ఈ ప్రాంత భౌగోళిక స్థితిగతులు, రాజకీయ పరిస్థితులు, నేల స్వభావం, జనం ప్రభావంపై పూర్తి అవగాహన కలిగిన సీఎం కేసీఆర్, దశాబ్దకాలాన్ని పైవాటితో శాస్త్రీయంగా జతకూర్చి జుగల్బందీలా కొనసాగించడం వల్లనే, అల్లాడిన ఈ నేల, తెల్ల పావురంలా ఎగురగలుగుతున్నది.

తెలంగాణలో భూమి సంపదను సృష్టిస్తున్నది, కంప్యూటర్లు కాసులు పండిస్తున్నాయి. నదులు, చెరువులూ నోట్ల వర్షం కురిపిస్తున్నాయి. కేసీఆర్ లాగా సాగు నుంచి ఐటీ దాకా సకల రంగాలను ఉత్పత్తికారక కేంద్రాలుగా మలిచిన ముఖ్యమంత్రులు లేనేలేరు. ఉద్యమ సమయంలోనైనా, తెలంగాణకు దారిచూపుతున్న వర్తమానంలోనైనా, కేసీఆర్ ఎత్తుకున్నాడంటే కొస ఎల్లేదాకా వదలడనే సత్యం ప్రజలందరికీ తెలిసిందే. అందుకే కేసీఆర్ ప్రెస్‌మీట్‌ను కూడా పండుగ నాడు మధ్యాహ్న భోజనానికి కుటుంబం అంతా కలిసి కూర్చున్నట్టుగా, టీవీల ముందు వాలి జనమంతా వింటారు. అదే ధోరణిలోనే ఆదివారం నాడు కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రెస్‌మీట్‌ను కూడా వేలాది సెల్‌ఫోన్ల ద్వారా, టీవీల్లో లక్షల మంది ప్రజలు ఆసక్తిగా విన్నారు. వాస్తవానికి పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలపై ప్రజలకు ఆసక్తి కరువై చాలా కాలమే అయింది. కానీ, పదేండ్ల స్వయం పాలనలో పంచుకున్న ఫలాలు, గులాబీ పార్టీ భరోసాలపై జనానికి విశ్వాసాన్ని కల్పించాయి. అడగనిది, అడిగింది, చెప్పనిదీ, చెప్పిందే కాదు ఏ పాలకుడూ ఊహించజాలని పథకాలను అమలుచేసి చూపింది కేసీఆర్ సర్కార్. ఆ దార్శనికత వల్లే రైతుబంధు, బీమా, కల్యాణలక్ష్మి, దళితబంధు, బీసీ బంధు, కంటివెలుగు లాంటి 450కి పైగా మానవీయ సర్కార్ స్కీమ్‌లు అమలయ్యాయి. అందుకే కేసీఆర్ నోటెంట మాట వింటేనే ప్రజలకు పట్టలేని పరవశం. నిన్నటి మ్యానిఫెస్టో మళ్లీ అదే అంతులేని ఆనందాన్ని సామాన్య ప్రజలందరికీ కలిగించింది. బుద్ధి జీవులందరి సంఘీభావాన్నీ పొందింది.

పదేండ్లలోపే చీకట్లను దాటి తెలంగాణ మిరుమిట్లను గెలుచుకున్నది. అదే వేగంతో వెన్నెల్లాంటి జీవితాలను సుస్థిరపరిచే లక్ష్యంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2023 ఎన్నికల ప్రణాళికలను రూపొందించారు. సంపద సృష్టి, సంక్షేమ పథకాలను మానవ వికాసంలో మరో చరిత్ర నిర్మాణానికి జోడెడ్లుగా మలిచే కార్యాచరణ ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతూనే ఉన్నది. ఆ ప్రగతి రథాన్ని ముందుకే నడిపించేందుకు జన మ్యానిఫెస్టోను తెలంగాణ సమాజం ముందుపెట్టారు కేసీఆర్. రూపమే కాదు సారమూ కనపడని సర్కార్లు ఏలుతున్న దేశంలో, తెలంగాణది మాత్రం ప్రాణమున్న ప్రభుత్వం. వాటి విలువ నెరిగిన సుగుణమున్న పాలకుడిగా ప్రతి ఇంటికీ ధీమానిచ్చే కేసీఆర్ బీమా పథకాన్ని రాష్ట్రంలోని దాదాపు 93 లక్షల కుటుంబాలకు హామీ ఇచ్చారు. అలాగే ఇప్పటికే తెలంగాణలో మానవీయ పథకంగా మన్ననలు పొంది, 36 లక్షలకు పైగా లబ్ధి దారులకు ప్రతి నెలా రూ.2,016లు అందిస్తున్న ఆసరా పింఛన్ల మొత్తాన్ని దశలవారీగా రూ.5,016కు పెంచుతామని కేసీఆర్ ఇచ్చిన హామీ అందరిలో పండుగ సంతోషాన్ని కల్పించింది. అదే విధంగా అలాగే తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలన్నింటికీ సన్నబియ్యం అందించే తెలంగాణ అన్నపూర్ణ స్కీం హామీ కూడా సంక్షేమరంగంలో దేశానికి దారిచూపే చర్యగా నిలుస్తుంది. అదే కోవలో సౌభాగ్యలక్ష్మీ పథకం ద్వారా అర్హులైన ప్రతి మహిళకు ప్రతి నెలా 3 వేల గౌరవ భృతి, కేసీఆర్ ఆరోగ్య రక్ష ద్వారా ఆరోగ్యశ్రీ బీమా పరిమితిని 15 లక్షలకు పెంచడం, అర్హులైన కుటుంబాలకు, జర్నలిస్టులకు రూ.400 కే గ్యాస్ సిలిండర్ ఇలా అనేక మనసు గల్ల మహా ప్రణాళికను కేసీఆర్ ప్రజారాశుల చేతుల్లో పెట్టారు.

అంతరాల్లేని, ఏ చింతలూ చుట్టుముట్టని సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలను, ఒక్కో విద్యార్థిపై ఏటా 1 లక్షా 20 వేలకు పైగా ఖర్చుపెడుతూ నిర్వహిస్తున్నది. వాటిలో చదువుతున్న 5 లక్షల కుటుంబాలకు చెందిన బిడ్డలు అద్వితీయమైన ఫలితాలు చూపుతున్నారు. అగ్రవర్ణ పేదల కోసమూ నియోజకవర్గానికి ఒకటి చొప్పున, 119 గురుకులాలను ఏర్పాటుచేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ కూడా అందరి ప్రభుత్వ విధానంగా చరిత్రలో నిలుస్తుంది. పేదరికం, అవకాశాల అందుబాటులో వ్యత్యాసమే సమాజంలో అంతరాలకు, నిరాశకు ప్రధాన కారణాలు. అవి మనందరి మెడకూ బాధాకరమైన భౌతిక పరిస్థితులై వేలాడుతూనే ఉంటాయి. అవకాశాలను అందరికీ చేరువలోకి తేగలిగితే, వ్యత్యాసాలు వేగంగా మాయమౌతాయి. ఈ ఉన్నత ఆశయంతోనే కేసీఆర్ సంక్షేమ పథకాలను విప్లవాత్మక దృక్పథంతో అమలుచేశారు, మరో దశకు వాటిని వాగ్దానం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో 11 వేల కోట్లతో గొర్రెల యూనిట్‌ల పంపిణీ, వందలాది కోట్లతో 25 వేల కోట్ల మత్స్య సంపదను బీసీ కులాల ఆస్తిగా అందించింది గులాబీ ప్రభుత్వం. దళితబంధు, బీసీబంధు పథకాలతో దివ్యమైన దారినీ పరిచింది. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, 350 బస్తీ దవాఖానలు, కంటివెలుగు లాంటి ఎన్నో వైద్య సేవలు పేద వర్గాలకే వరంలా ఉపయోగపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లుగా ప్రతి పథకం ప్రజలందరి సౌభాగ్యం కోసమే అమలు పరుచబడింది. కరెంటు, సాగు నీరు, పరిశ్రమలు, ఉద్యోగాలు, రైతు సంక్షేమ పథకాలు, ఐటీ ఇలా అన్నింటా అద్భుతమైన ఫలితాలను తెలంగాణ సాధించింది. ఆర్థిక క్రమశిక్షణలోనూ రిజర్వ్ బ్యాంక్ ప్రశంసలు పొందింది మన రాష్ట్రం.

> ఎగుమతుల రాష్ట్రంగా, పంటల దిగుబడిలో నెంబర్ వన్ ర్యాంకర్‌గా తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతి తలుచుకుంటేనే గుండె గర్వంతో ఉప్పొంగుతుం ది. ఎన్నో ఆశయాలను సాకారం చేసిన సీఎం కేసీఆర్, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాం గ భావనలను కొనసాగించేందుకే మ్యానిఫెస్టోలో స్పష్టమైన హామీలిచ్చారు.

ప్రస్తుతం సామాజిక న్యాయం అనే నినాదం సంతలో సరుకుగా మార్చబడింది. నిజానికి దాని కి అంతరార్థం సమాజంలోని వస్తు సేవలు, ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు ప్రజలందరి జీవితాల్లో ఒకే విధంగా అందుబాటులో ఉంచడమే. అదే ఉన్నతమైన దృష్టికోణంతో కేసీఆర్ పాలన నడిచింది. ఇప్పుడు బీఆర్ఎస్ 2023 ఎన్నికల ప్రణాళిక కూడా అదే బాటలో ప్రజలముందు ఉంచబడింది. ఇది కేసీఆర్ రాసిన భవిష్యత్తు, వర్తమానం వెలుగులో అందరం కలిసి నడుద్దాం. 'మళ్లీ మళ్లీ రావాలి మనసుగల్ల సర్కార్' అని మనమందరం మనసారా ప్రార్థిద్దాం.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్)

విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం ఏపీకి చెందిన లక్షలాది మంది తెలంగాణ రాష్ట్రంలో అనేక దశాబ్దాల కిందట స్థిరపడ్డారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనే ఇరవై లక్షలకు పైగా జనాభా ఉన్నట్టు అనేక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అదేవిధంగా నిజామాబాద్, ఖమ్మం జిల్లాలతో పాటు ఇతర తెలంగాణ జిల్లాల్లో పది లక్షల వరకు ఆంధ్రులు స్థిరపడినట్టు అవే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణాంధ్రులు!



కైలసాని శివప్రసాద్
94402 03999



ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రులంతా వారి స్వరాష్ట్రానికి వెళ్లిపోతారని అనేక వార్తలు షికారు చేశాయి. అందుకు భిన్నంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఏపీకి వెళ్లారు. అదేవిధంగా కొద్దిమంది స్థిరాస్తి వ్యాపారులు, చిన్న, మధ్యతరహా వ్యాపారవేత్తలు మాత్రమే వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లిన వ్యాపారులు అక్కడ ఎక్కువకాలం మనుగడ సాగించలేక తిరిగి హైదరాబాద్‌కు రావడం గమనార్హం. ఈ పరిణామానికి ఏపీలో జరుగుతున్న ప్రభావవంతమైన రాజకీయ పరిణామాలే ప్రధాన కారణమని తెలుస్తున్నది.

తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రులందరూ ఎటువంటి ఆటంకాల్లేకుండా సుహృద్భావ వాతావరణంలో తమ జీవన యానం కొనసాగిస్తున్నారు. ప్రశాంతంగా తమ పని తాము చేసుకుంటూ పోతున్న తెలంగాణ ఆంధ్రులను రాజకీయాల్లోకి లాగి వారి ఓట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి ద్వారా నారా లోకేష్‌ను పిలిపించుకొని నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ గురించి వాకబు చేసినట్టు తెలుస్తున్నది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తెలంగాణలో స్థిరపడిన కొందరు ఏపీకి చెందిన కుల సంఘాల నాయకులతో ఇటీవల సమావేశమయ్యారు. ఏపీలో ఇటీవల జరిగిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టు సందర్భంగా కొంత మంది ఐటీ ఉద్యోగులు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిరసన వ్యక్తం చేశారు.

నిరసనలతో ఐటీ పరిశ్రమ అస్తిత్వానికి, ప్రశాంతతకు భంగం కలిగించవద్దని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖామాత్యులు కేటీఆర్ ఐటీ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలకు వక్ర భాష్యం చెప్తూ బీజేపీ, కాంగ్రెస్, కొంతమంది కుల సంఘ నాయకులు బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రాష్ట్రమంతా ఉద్యమాలు చేసినా హైటెక్ సిటీలో మాత్రం టీఆర్ఎస్ ఆందోళనలు చేయలేదు. చంద్రబాబు అరెస్టు విషయం ఏపీలోని రెండు రాజకీయ పార్టీలకు చెందిన అంశం కనుక హైటెక్ సిటీలో ఆందోళన చేయవద్దని కేటీఆర్ స్పష్టంగా చెప్పారు. కేటీఆర్ వ్యాఖ్యలను తప్పు పట్టాల్సిన విషయం ఏముందో మేధావులకు సైతం అర్థం కావడం లేదు. ఒక్క తెలంగాణకే కాదు, ఏపీలోని ఐటీ ఉద్యోగ ఆశావహులకు కూడా హైదరాబాద్ ఐటీ పరిశ్రమే ఆశాకిరణం.కనుక ఐటీ పరిశ్రమ ఆవశ్యకత, ప్రాముఖ్యాన్ని గుర్తెరిగి మసలుకోవలసిన బాధ్యత ఐటీ ఉద్యోగులందరిపై ఉందనేది నిర్వివాదాంశం.

> ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి కేటీఆర్ అమోఘమైన కృషే దానికి ప్రధాన కారణం. దేశంలోనే ప్రముఖ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఐటీ రంగం మనుగడ ఆందోళనల వల్ల దెబ్బతింటుందనే కేటీఆర్ ఆ విధంగా స్పందించినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తు కోసమే స్పందించిన కేటీఆర్ వ్యాఖ్యలను రాజకీయాల కోసం వాడుకోవాలని చూడటం సమర్థనీయం కాదు.

ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలు విస్మరించిన కాంగ్రెస్, బీజేపీ రెండు రాష్ట్రాల్లోనూ పూర్తిగా ప్రజల విశ్వాసం కోల్పోయాయి. కుల, మత, పార్టీలకతీతంగా తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రులందరూ గంపగుత్తగా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే కేసీఆర్‌తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఇక్కడ స్థిరపడిన ఆంధ్రులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ప్రభుత్వపరంగా అవసరమైన పనులన్నీ చేసిపెడుతున్నారు. కేవలం కేటీఆర్ వ్యాఖ్యలను బూచిగా చూపి కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ఆంధ్రుల మద్దతు పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించవని గుర్తించాలి.

తెలంగాణ రాష్ట్రం లౌకికవాదానికి పెట్టింది పేరు. అన్ని కులాల, మతాల ప్రజలకు, అన్ని ప్రాంతాల ప్రజల జీవన మనుగడకు దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో లేని పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది. దీన్ని పరిరక్షించవలసిన బాధ్యత రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలు, అన్నివర్గాల ప్రజలపై ఉందనేది నిర్వివాదాంశం.